ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. యశోద ఆసుపత్రికి చెందిన కంటి వైద్యులు శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు.

కింది బస్తీలో ఘనంగా బోనాలు



బోనాలతో కుమ్మరి బస్తీ మహిళలు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. కింది బస్తీ కుమ్మరి బస్తీలో దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బస్తీవాసులు దుర్గమ్మకు బోనాలను సమర్పించారు. బస్తీలో బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బస్తీవాసులు పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రతన్‌కుమార్ ఎందరినో అథ్లెటిక్స్‌గా తీర్చిదిద్దారు



హెడ్ అథ్లెటిక్స్ కోచ్ రతన్‌కుమార్ బోస్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

శామీర్‌పేట్: హెడ్ అథ్లెటిక్స్ కోచ్ రతన్‌కుమార్ బోస్ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నగరంలోని ప్యాలెస్ హైట్ హోటల్‌లో జరిగింది. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు సాప్ మెయిన్ స్పోర్ట్స్ కోచ్‌గా రతన్‌కుమార్ బోస్ విధులు నిర్వర్తించారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయన శిక్షణ అందించి ఉన్నతంగా ఎదిగేలా కృషి చేశారు. ఇప్పుడు వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని ఈ కార్యక్రమ నిర్వాహకులు సురేష్, సయ్యద్ ఖైజర్, రామకృష్ణ, భరత్‌రెడ్డి, ప్రసాద్, శాంతి తెలిపారు.

రోడ్డు కబ్జాపై ఫిర్యాదు

అల్వాల్: నేరెడ్‌మెట్ డివిజన్ మెహర్‌బాబా కాలనీలో 30 ఫీట్ల రోడ్డు కబ్జా చేసేందుకు పలువురు కుట్ర పన్నుతున్నారని, కాలనీ రోడ్లను ఆక్రమిస్తే సహించబోమని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. ఆదివారం కాలనీలో సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1988–1989లో అంజయ్యగౌడ్, చక్రపాణి, సుతికీర్తి చేని లే అవుట్లను 3 జీపీఏ కింద సీతారామరావు ద్వారా విక్రయించారని, దీనిలో భాగంగానే టీఆర్‌కె.రావుకు గోమునింద్ర ట్రస్ట్ ద్వారా భూములు బహూకరించారన్నారు. మధుమతి ద్వారా మెహర్‌బాబా కాలనీలోని ప్లాట్ నెంబర్లు–81,82 గిఫ్ట్ డీడ్ ద్వారా అందించారని, ఇటీవల ప్లాట్ నెంబర్లు 81, 82 పరిధిలోని 30 ఫీట్ల రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే రెండుసార్లు రోడ్డు ఆక్రమణలను తొలగించారన్నారు. పలువురు వ్యక్తులు, రౌడీలతో కలిసి రాత్రికి రాత్రి వచ్చి కాలనీలోని రోడ్డును ఆక్రమించేందుకు యత్నించి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని, ఈ విషయంపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో ఎలాంటి కబ్జాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై హైడ్రాకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కోశాధికారి శేషు, శ్రీనివాస్, ప్రసాద్, రాజశేఖర్, చక్రధర్‌రావు, హరికిషన్, భాగ్యవతి, సరిత, జయశ్రీ తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

మల్లాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను అందరూ కొనసాగించాలని దళిత జనసమితి అధినేత, రాష్ట్ర చైర్మన్ బొజ్జ యాదగిరి అన్నారు. ఆదివారం ఆయన దళితరత్న అవార్డు అందుకున్న సందర్భంగా మల్లాపూర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె శంకర్, పీజీ సుదర్శన్, తెలంగాణ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరసింహ, జితేందర్, మోహన్‌రావు, యాదగిరి, దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో‌- ఆర్డినేటర్ బొజ్జ రాకేష్, వెంకటప్రసాద్ తదితరులున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..!

600 చదరపు అడుగుల విస్తీర్ణం దాటితే..అంతే

- తొలి విడతలో ఎంపికైన వాటిలో బేస్‌మెంట్ పూర్తయింది 28 ఇళ్లే..
- రెండో విడతలో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- వచ్చే నెల 5 వరకు లబ్ధిదారుల తుది జాబితా



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతంగా చేపట్టేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు కాగా, సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మే 5 నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జనవరి 26న మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 752 ఇళ్లు మంజూరు కాగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు యుద్ధప్రాతిపదికన అధికార యంత్రాంగం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కసరత్తు చేస్తోంది. పేదల్లో అతి పేదలకు ముందుగా ప్రాధాన్యం ఇచ్చి ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా ఎంపికైన లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అవసరమైన సాయం అందించేందుకు మండలానికి ఒక బృందాన్ని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తొలి విడతలో 28 ఇళ్లకు పూర్తయిన పునాది..

తొలివిడతలో ఎంపిక చేసిన వాటిలో 28 ఇళ్లకు బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యింది. ఒక దశ విజయవంతంగా ముగియడంతో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నిర్మాణ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారులే పునాది వరకు నిర్మించాక అధికారులు బిల్లింగ్ చేస్తే మంజూరైన మొత్తంలో ప్రభుత్వం తొలివిడతగా రూ.లక్షను వారి ఖాతాల్లో జమచేస్తోంది. పేదలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం, బేసిమెంట్ వారే నిర్మించుకోవాలని నిబంధన పెట్టడంతో పలువురు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు..

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు ప్రారంభమైంది. ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాలు, పురపాలక సంఘాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయగా, వారు పరిశీలించి, ఆ జాబితాను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేశారు. ఈ కమిటీలు కూడా జాబితాపై మరోసారి విచారణ నిర్వహించి, ఎంపీడీవోలు, పురపాలక అధికారులు అప్పగించగా, వారు ఈ నెల 30 వరకు మరో సారి విచారణ చేపట్టనున్నారు. మే 5 వరకు తుది జాబితాను పోర్టల్‌లో మరోసారి విచారించి..జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదిస్తారు.

విస్తీర్ణం దాటితే...అనర్హతే..

నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించకుంటే అనర్హులుగా గుర్తిస్తారు. సొంత ఇంటి స్థలం ఉన్న పేదలు 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో తమకు ఇష్టమొచ్చినట్లు ఇల్లు నిర్మించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. లబ్ధిదారులకు పలు విడతల్లో రూ.5 లక్షల సాయం అందజేయనుంది. తొలిదశలో పునాది పూర్తయిన ఇంటి నిర్మాణాలకు మొదటి విడతగా రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేస్తారు. గృహ నిర్మాణశాఖ పునాది పూర్తయిన ఇళ్ల కొలతలు చేస్తుండటంతో..కొంత మంది లబ్ధిదారులు ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. వీరికి మొదటి విడతగా చెల్లించే రూ.లక్ష నిలిపివేశారు. 600 చదరపు అడుగుల స్థలం మించి నిర్మాణం చేపట్టిన వారు పేదలు కాదని, వారికి ఇందిరమ్మ పథకం వర్తించదని గృహనిర్మాణ శాఖ చెబుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ కృషి



సాక్షి, సిటీబ్యూరో: విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. ఉపాధ్యాయ నాయకులు నిరంతరం అధ్యయనం చేస్తూ..ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శని, ఆది వారాల్లో నగరంలో టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా శాఖ నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యమ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. మొదటి రోజు 'ఉపాధ్యాయ ఉద్యమం'అనే అంశంపై ఉపాధ్యాయ రాష్ట్ర నేత పాపన్నగారి మాణిక్ రెడ్డి బోధించారు. ఈ సందర్భంగా సంఘం పని విధానం, ఉపాధ్యాయ సమస్యల సాధనకు సంబంధించిన ఉద్యమం పని తీరును మాణిక్‌రెడ్డి వివరించారు. రెండవ క్లాస్‌లో 'విద్యారంగం–శాస్త్రీయ ఆలోచనలు'అనే అంశంపై సంఘం రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరీ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య, జిల్లా అధ్యక్షులు ఓ జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్, వందన, జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, సుందరయ్య, సుధాకర్, అనంతయ్య, ఆడిట్ కన్వీనర్ గౌరయ్య, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల



ఘట్‌కేసర్: అంబేడ్కర్ వర్ణ, కుల వ్యవస్థను రూపుమాపి సమసమాజం స్థాపించారని ఎఫ్‌ఎస్‌సీఎస్ (రైతు సేవా సహకార సంఘం) డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేడ్కర్ చలువతో తెలంగాణతో పాటు ఇతర చిన్న రాష్ట్రాలు ఏర్పడ్డాయ తెలిపారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాది దాడి తిరిగి జరగకుండ సరిహద్దు భద్రతను బలోపేతం చేసి, శత్రుదేశాలు భారతదేశం వైపు కన్నెత్తిచూడకుండ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్‌గౌడ్, స్టీవెన్, రమాదేవి, ఎస్ శ్రీనివాస్‌గౌడ్, రాందాసు,నర్సింగ్‌రావు, సత్యం, ఆంజనేయులు, జగదీశ్, ఆనంద్ పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాపం



సంతాప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నేతలు

జవహర్‌నగర్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారి స్మృతిలో భాగంగా జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి టి.కాలేషా ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్ దేవేందర్‌నగర్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జవహర్‌నగర్ కార్పొరేషన్ చైర్మన్ ఎండి.పాషామియా హాజరై మాట్లాడారు. దేశ ప్రజలను కలిచివేసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారన్నారు. అనంతరం రాష్ట్రంలో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలనే చైతన్య మహిళ సంఘం అల్లూరి సావిత్రి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నగేష్, శివనారాయణ, వెంకటాద్రి, షేక్ షావలి, బడిగే వెంకటేష్, ప్రవీణ్, సింగరయ్యగౌడ్, సునీత, సావిత్రి, ఎస్‌కె.మీరా, వేణు, మల్లేష్, జావేద్, బాలు, కమిటీ సభ్యులు వహీద్, సయ్యద్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్య, కొండల్ ముదిరాజ్ తదితరులు



జవహర్‌నగర్‌లో జెండావిష్కరిస్తున్న మాజీ మేయర్ కావ్య

జవహర్‌నగర్: అభివృద్ధి, ప్రజా సంక్షేమం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమని మాజీ మేయర్ కావ్య అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం జవహర్‌నగర్‌లో పార్టీ జెండావిష్కరించి వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు జిట్ట శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, ఆలూరి సంగీత రాజశేఖర్, బీఆర్‌ఎస్ పార్టీ జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి..

మేడ్చల్: వజ్రోత్సవ సభకు మేడ్చల్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఆదివారం నాయకులు తమ వార్డులలో, గ్రామాల్లో పార్టీ 25వ సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండాలు ఆవిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. భాస్కర్‌యాదవ్, సుదర్శన్, నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్ ఉన్నారు.

నారపల్లిలో..

పోచారం: నారపల్లిలో బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి గులాబీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రజతోత్సవ సభతో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు సన్నద్ధమైందన్నారు. బద్ధం జగన్మోహన్‌రెడ్డి, కొమ్మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్, పాండు, సుర్వి రవీందర్, అక్రమ్ అలీ, సుర్వి శ్రీనివాస్, అబ్బవతిని నర్సింహ, జహంగీర్, దశరథ్ పాల్గొన్నారు.



నారపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న మందడి సురేందర్‌రెడ్డి తదితరులు



మేడ్చల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

బోడుప్పల్: బొల్లిగూడెంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఆయా కాలనీవాసులు మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రే‌ష్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. పడతం లోకేష్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, శ్రీధర్‌రెడ్డి, మధు, సతీష్, రాజునాయక్, నాగరాజు, రాజేష్, కుమార్, గణేష్ తదితరులున్నారు.

గోశాలలో అన్న ప్రసాద వితరణ



రామంతాపూర్ : అమావాస్య సందర్భంగా స్థానిక పాండురంగస్వామి దేవాలయం గోశాల వద్ద జ్యోతిరావుపూలే సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆదివారం సేవా సంఘం నేతలు మాట్లాడుతూ.. అమావాస్య రోజు గోశాలలో గోవులను పూజించి అనంతరం అన్నప్రసాదం పెడితే పుణ్యఫలం లభిస్తుందన్నారు. సేవా సంఘం ప్రతినిధులు మహేందర్‌ముదిరాజ్, జగదీష్‌పటేల్, సురేష్ ముదిరాజ్, నరసింహ, సురేష్‌చారి, మల్లేష్ యాదవ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి కృషి వల్లే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్



మేడ్చల్‌లో అంబేడ్కర్ వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎస్సీ సెల్ నాయకులు

మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డి కృషి వల్లే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ వచ్చిందని మాదిగ జేఏసీ అధ్యక్షుడు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఆయన మేడ్చల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ సెల్ నాయకులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు న్యాయం చేయాలని వర్గీకరణ బిల్లును ఆమోదించి 9 శాతం రిజర్వేషన్‌ను కలిపించారన్నారు. వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన వారిని మాదిగలు ఎప్పటికీ మరువరని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు భానుచందర్ మాదిగ, చిన్నయ్య, మల్లేష్, ప్రవీణ్‌కుమార్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ సభ్యులు

ఘట్‌కేసర్: పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి గురుకుల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.

భూమి పత్రం ఇప్పిస్తామని మోసం.. ఇద్దరి రిమాండ్

ఘట్‌కేసర్: భూమి విడుదల పత్రం కోసం డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించని ఇద్దరిని ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరసింహ వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ న్యూభవానీనగర్‌కు చెందిన కొమ్మలరాజు సాయిలు (39) సివిల్ కాంట్రాక్టర్. జనవరి 9న రాజుల సాయిలుకు, బాలుసింగ్, రఫీక్‌నాయక్ ఫోన్‌చేసి భూమి విడుదల పత్రం కోసం రూ.2 లక్షలు అప్పు అడిగారు. అందుకు ఒప్పుకున్న సాయిలు డబ్బుతో ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వద్దకు రాగా ఇద్దరు కలిసి అతడిని బైక్‌పై పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వద్దకు తీసుకొచ్చి డబ్బులు తీసుకున్నారు. అనంతరం భూమి పత్రం తీసుకుని వస్తామని చెప్పి ఎంతకీ తిరిగి రాలేదు. వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుసింగ్, రఫీక్‌నాయక్‌ను రిమాండ్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దాయర గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కీసర: కీసర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1996 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రాంపల్లి దాయర గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

శామీర్‌పేటలో..

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1984–85కు చెందిన 10వ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బ్రిందా కన్వెన్షన్‌లో జరిగింది. 40 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక్క చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్య బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు.



అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పొదుపు సంఘాల్లో చేరేదెలా..?

తెలియక దూరంగా ఉంటున్న మహిళలు

- ప్రభుత్వం అందించే వివిధ రకాల రాయితీ రుణాలు పొందలేని స్థితి
- ఆధార్ చిరునామా..10 మంది మహిళలుంటే సంఘమే..
- దివ్యాంగులైతే..ఐదుగురు సభ్యులు చాలు
- మేడ్చల్ జిల్లాలో 10,575 మహిళా సంఘాలు.. 1.10లక్షల మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: చాలా మంది మహిళలకు సంఘంలో చేరే విధానం తెలవదు. ఇప్పటి వరకు మహిళలు సంఘంలో చేరనివారున్నారు. మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేరి ప్రభుత్వం అందించే వివిధ రాయితీ రుణాలు పొందడం తెలియక దూరంగా ఉంటున్నారు. తద్వారా స్వశక్తితో ఆర్థికంగా ఎదగడానికి అవకాశమున్న వెనకబడిపోతున్నారు. ఇప్పటికే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 10,575 సంఘాలు ఉండగా 1,10,007 మంది సభ్యులున్నారు. ఇప్పటివరకు ఎక్కడా సభ్యత్వం లేని మహిళలు కొత్త సభ్యులుగా చేరడానికి అవకాశముంటోంది. ఇందుకోసం ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటోంది.

నిబంధనలు ఇలా..

మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలంటే సదరు మహిళకు ఆధార్ కార్డు ఉండాలి. ఆధార్ చిరునామా ఎక్కడ ఉంటే అదే గ్రామం, పట్టణంలో మాత్రమే సభ్యత్వం ఇస్తారు. గతంలో ఏదైనా సభ్యత్వం ఉండి డీపాల్టర్‌గా ఉంటే కొత్త సంఘాల్లో సభ్యత్వం లభిస్తోంది. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యత్వం పొందడానికి అవకాశముంది. ఇప్పటికీ ఏ పొదుపు సంఘంలో సభ్యత్వం లేకుంటే కొత్తగా 10 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. దివ్యాంగులైతే కేవలం ఐదుగురు సభ్యులతో సంఘం ఏర్పాటు చేసుకునే అవకాశముంటోంది. గ్రూపు సభ్యులందరూ కలిసి గ్రూపు పేరిట సంయుక్త ఖాతాను తీసుకోవాల్సి ఉంటోంది. సంఘం సభ్యులందరూ కలిసి గ్రూపునకు ఎన్నికలు నిర్వహించుకుని, అధ్యక్ష, కార్యదర్శులు కమిటీని ఎన్నుకోవాల్సి ఉంటోంది. ఆతర్వాత తీర్మానం అమలు చేసుకొని సంఘానికి ఒక పేరు నిర్ణయించుకోవాల్సి ఉంటోంది. తీర్మానం ప్రతిని ఆయా బ్యాంకు మేనేజర్‌కు, ఐకేపీ సీసీకి అందజేయాల్సి ఉంటోంది. పట్టణాల్లో (పురపాలికల్లో) అయితే మెప్మా సిబ్బందిని కలిసి తీర్మానం ప్రతిని ఇవ్వాల్సి ఉంటోంది. సంఘం తీర్మానం ప్రకారం మొదటి, రెండో నాయకురాళ్ల పేరిట బ్యాంకు లావాదేవీలు కొనసాగుతాయి. కొత్తగా సంఘం ఏర్పాటైన మహిళలకు వ్యక్తిగతంగా గ్రూపునకు కలిపి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణం అందనుంది. ఈ రుణాలను సకాలంలో చెల్లిస్తే ఆరు నెలల తర్వాత ఇంకా ఎక్కువ మొత్తంలో రుణాలు అందజేస్తారు.